సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 7 । నవంబర్ । 2023



రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

మంథని: ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 14, 17, 19 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. 35 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో 10మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

నామినేషన్ల వివరాలు.. 3వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
పెద్దపల్లి	03	04
రామగుండం	00	00
మంథని	01	01

న్యూస్‌రీల్

ఎన్నికల ప్రచారానికి అనుమతి తీసుకోవాలి

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్: రామగుండం నియోజకవర్గంతోపాటు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, వాట్సప్, యూట్యూబ్, ట్విట్టర్(ఎక్స్) తదితర సామాజిక మాధ్యమాల్లో మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ నుంచి అనుమతి తీసుకొని ప్రచారం చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ, పెద్దపల్లి ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నుంచి జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు ఇంటర్నెట్ బేస్డ్ మీడియా, వెబ్‌సైట్, సోషల్ మీడియాల్లో వచ్చే ఎన్నికల ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అనుమతిలేకుండా సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారం చేయరాదని, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై సోషల్ మీడియాలో వచ్చేవాటిని పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

నకిలీ మద్యం గుర్తించేందుకూ యాప్

పెద్దపల్లిరూరల్: నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు వెరిట్ యాప్‌ను వినియోగించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి సూచించారు. మొబైల్ నంబరుతో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. మద్యం సీసాపై ఉన్న బార్‌కోడ్‌ను ఈ యాప్ సాయంతో స్కాన్‌చేస్తే మద్యం తయారీదారు చిరునామా, కోడ్, తయారైన తేదీ, డిపో లొకేషన్, అమ్మకం జరిగిన ప్రాంతం, మద్యం దుకాణం పేరు, ధర తదితర వివరాలన్నీ తెలుస్తాయని పేర్కొన్నారు. మద్యం సీసాపై బార్‌కోడ్ లేకుంటే టోల్‌ఫ్రీ నంబరు 18004252523కు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఖైరతాబాద్ ఇన్‌చార్జిగా కోలేటి దామోదర్



గోదావరిఖని: గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ కార్యదర్శి కోలేటి దామోదర్‌ను ఖైరతాబాద్ ఇన్‌చార్జిగా నియమించారు. ఈఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించేందుకు సీఎం కేసీఆర్ ఆయనకు ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

ఓటు ప్రాముఖ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో సోమవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో కమిషనర్ నాగేశ్వర్, స్వీప్ నోడల్ అధికారి స్వరూపరాణి ఆధ్వర్యంలో ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. చైతన్య రథంతో కళాకారులు ఆటపాటలతో ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో మెప్మా, కార్పొరేషన్ సిబ్బంది, ఆర్పీలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాఆశీర్వాదం కోసం..



పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న రవీందర్‌సింగ్, మనోహర్‌రెడ్డి

- నేడు జిల్లాకు గులాజీ దళపతి కేసీఆర్
- మంథని, పెద్దపల్లిలో బహిరంగ సభలు
- భారీ జనసమీకరణలో పార్టీ శ్రేణులు

సాక్షి,పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, ప్రజల ఆశీర్వాదం కోసం గులాబీ పార్టీ బాస్, సీఎం కేసీఆర్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచార సభలతో బీఆర్‌ఎస్ క్యాడర్‌లో మరింత జోష్ పెంచడానికి సిద్ధమయ్యారు. దీంతో పెద్దపల్లి, మంథని అసెంబ్లీ కేంద్రాల్లో ఆ పార్టీ శ్రేణులు కేసీఆర్ హాజరయ్యే సభలను భారీగా నిర్వహించాలనే తలంపుతో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పుట్ట మధు, దాసరి మనోహర్‌రెడ్డిని ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. తొలుత మంథని, ఆ తర్వాత పెద్దపల్లిలో జరిగే బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు.

తొలుత మంథనిలో..

మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో బహిరంగసభ అనంతరం సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ ద్వారా మంథనికి చేరుకుంటున్నారు. అక్కడి గోదావరిఖని మార్గంలో ఏర్పాటు చేసిన సభాస్థలం వద్దకు మధ్యాహ్నం 2గంటలకు చేరుకుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్ నిర్మించారు. వచ్చిన వెంటనే కాసేపు పార్టీ అభ్యర్థులతో కేసీఆర్ సమీక్షిస్తారు. బహిరంగసభా వేదికపైకి వచ్చి మంథని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. తదనంతరం పెద్దపల్లి బహిరంగసభకు బయలుదేరి వస్తారు.

పెద్దపల్లి ఐటీఐ గ్రౌండ్‌లో హెలిప్యాడ్

మంథని సభ అనంతరం హెలిక్యాప్టర్ ద్వారా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు కేసీఆర్ చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 5గంటలకు హెలిక్యాప్టర్‌లోనే తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

కట్టుదిట్టమైన పోలీసు భద్రత

బీఆర్‌ఎస్ బహిరంగ సభకు సీఎం కేసీఆర్ హాజరుకానుడడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఇందుకోసం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తోంది. పోలీసులు సభా ప్రాంగణాన్ని ఇప్పటికే తమ అధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. హెలిప్యాడ్, పార్కింగ్, ప్రజలు సభకు చేరుకునే మార్గాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. డాగ్ స్క్వాడ్‌తో సభావేదిక, ప్రాంగణంలో అణువణువూ జల్లెడ పట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

భద్రత చర్యల పరిశీలన

మంథని: కాగా, సభాస్థలి, హెలిప్యాడ్‌ను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. పెద్దపల్లి డీసీపీ చేతన కూడా ఏర్పాట్లు పరిశీలించారు. పోలీసు విధులపై ఆరా తీశారు.

ముస్తాబైన సీఎం సభ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పుట్ట మధు

మంథని: గోదావరిఖని–మంథని మార్గంలోని వంటగ్యాస్ గోదాం సమీపంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రముఖుల ప్రసంగాలకు ఒకటి, కళాకారుల కోసం మరో వేదిక నిర్మించారు. సుమారు లక్షమందికిపైగా ప్రజలు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు.

విలోచవరం దారిలో హెలిప్యాడ్

విలోచవరం వెళ్లేదారి అయ్యగారి చెరువుకు సమీపంలోని ఖాళీస్థలంలో హెలిప్యాడ్ నిర్మించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లేందుకు వీలుగా భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. అలాగే నియోజకవర్గంలోని పది మండలాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం గోదావరి నది దారిలో నాలుగుచోట్ల పార్కింగ్ స్థలాలు నిర్మించారు. స్థభాస్థలితోపాటు ఇతర ఏర్పాట్లను బీఆర్‌ఎస్ నాయకుడు జక్కు రాకేశ్‌తో కలిసి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు సోమవారం పరిశీలించారు.

గులాబీమయం..

సభా ప్రాంగణంలో భారీ సభావేదిక నిర్మించారు. సభాస్థలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మైదానాన్ని చదును చేసి బారికేడ్లు నిర్మించారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పెద్దపల్లి, మంథని పట్టణాలు గులాబీమయమయ్యాయి. సభాస్థలి వరకు వెళ్లేదారుల్లో గులాబీ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభకావడం.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఒకరోజే రెండు నియోజవకర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొననుండటంతో జిల్లాలో ఎన్నికల వేడి మరింత పెరిగింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లిరూరల్: రైతుల నుంచి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు వీలుగా బుధవారం నాటికి నాటికల్లా అందుబాటులోకి రావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా 305 కొనులు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించగా ఇప్పటివరకు 57 కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయని తెలిపారు. వరి కోతలు ఊపందుకున్నాయని, వీలైనన్ని సేకరణ కేంద్రాలను అందుబాటులోకి తేవాలన్నారు. ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తేమ కొలిచే పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ధాన్యం రవాణా కోసం లారీలకు కొరత లేకుండా, హమాలీలతో ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. రైస్‌మిల్లర్ల వద్ద ఉన్న గన్నీసంచుల నాణ్యత పరిశీలించాలని, కొనుగోలు కేంద్రాలకు మిల్లర్లను కేటాయిస్తూ, వాటిని సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీధర్, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్‌వో శ్రీమాల, డీఏవో ఆదిరెడ్డి, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ఉంటేనే పత్తి కొనుగోలు

- పెద్దపల్లిలో ప్రారంభమైన సేకరణ
- రైతు బ్యాంకు ఖాతాలోనే సొమ్ము జమ



పత్తి తూకం వేస్తున్న వ్యాపారులు

పెద్దపల్లిరూరల్: జిల్లా మార్కెటింగ్ శాఖ, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)లు పత్తి కొనుగోళ్లు ప్రారంభించాయి. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం క్వింటాలుకు గరిష్టంగా రూ.7,021, కనిష్టంగా రూ.6,021 ధర పలికింది. సగటున రూ.6,911 నిర్ణయించినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. జిల్లాలో 71వేలపై చిలుకు ఎకరాల్లో పత్తి సాగు చేయాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా నిర్దేశించగా 63వేలకు పైగా ఎకరాల్లో సాగైంది. దాదాపు 6లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

పెరిగిన మద్దతు..

- ఈసీజన్ నుంచి పత్తి మద్దతు ధర పెంచుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది.
- కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.6,620 ఉండగా గరిష్టంగా రూ.7,020 పలికింది.
- ఐదేళ్ల క్రితం(2018–19)లో క్వింటాలు కనిష్టంగా రూ.5,150, గరిష్టంగా రూ.5450 ధర ఉంది.
- ఈ క్రమంగా ఏటా స్వల్పంగా పెరుగుతూ వచ్చిన ధర ఇప్పుడు రూ.7,020కి చేరింది.

జిల్లాలో ఏడు జిన్నింగ్ మిల్లులు..

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్, సీసీఐ కొనుగోలు కేంద్రంతోపాటు జిన్నింగ్ మిల్లుల్లోనూ రైతులు పత్తి నేరుగా విక్రయించే వీలుంది. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాలకు చెందిన రైతులు తమకు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లోనూ మద్దతు ధరకు అమ్ముకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

- పత్తి రైతులు మద్దతు ధర పొందేందుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.
- పత్తి తీసుకొచ్చే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారుపాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం వెంట తీసుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.
- మొబైల్ నంబరు లింక్ చేసిన తర్వాత పత్తి కొనుగోలు చేస్తారని పేర్కొంటున్నారు.
- కౌలు రైతులైతే స్థానిక వ్యవసాయ విస్తీర్ణాధికారుల నుంచి ధ్రువీకరణపత్రం పొందాల్సి ఉంటుందని వివరించారు.
- కొనుగోళ్లు పూర్తయ్యాక చెల్లించాల్సిన సొమ్మును సదరు రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుందని అధికారవర్గాలు తెలిపాయి.

ఇళ్లలో ఇంకా పాతపత్తి నిల్వలు..

రైతులు గత సీజన్‌లో పండించిన పత్తిని తమ ఇళ్లలో ఇంకా నిల్వ ఉంచుకున్నారు. పత్తి ధర పెరుగుతుందని ఆశించి నివాసాల్లో నిల్వచేసినా.. పెరుగుదల అంతంత మాత్రంగా ఉంది. దీంతో రైతులు తమ అవసరాలకు అనుగుణంగా కొద్దికొద్దిగా తీసుకొచ్చి విక్రయించారు. మిగతాదంతా అమ్ముకునేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో జిల్లాలోని పెద్దపల్లి, ముత్తారం, జూలపల్లి, ఓదెల తదితర మండలాలు, గ్రామాల్లో ఇంకా పత్తి నిల్వలున్నాయి. ఈ సీజన్‌లో ఆ పత్తిని అమ్ముకునేందుకు అవకాశముంది.

సజావుగా కొనుగోళ్లు



పత్తి విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్ని వసతులను కల్పిస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన పత్తి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి.

– దేవరాజ్ పృథ్వీరాజ్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

నాలుగు నామినేషన్లు దాఖలు







నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న నూకల నవీన్, పొన్నాల సతీశ్, కారపురి నరేశ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి సోమవారం ముగ్గురు అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియా జనశక్తి పార్టీ అభ్యర్థిగా పొన్నాల సతీశ్ రెండు సెట్లు, నూకల నవీన్, కారపురి నరేశ్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కోసెట్ నామినేషన్లు అందించారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుమోహన్ తెలిపారు.

మంథని నుంచి..

మంథని: మంథని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్‌కు తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. తొలుత స్థానిక బిక్షేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డితోపాటు పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, నాయకులు సత్యప్రకాశ్, పోతరవేణి క్రాంతికుమార్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న సునీల్‌రెడ్డి

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎంఈవో సంపత్‌రావు



మాట్లాడుతున్న ఎంఈవో

గోదావరిఖనిటౌన్: స్కౌట్స్ అండ్ గైడ్స్ శ్రమించి ఉన్నత శిఖరాలకు ఎదిగి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని రామగుండం మండల విద్యాధికారి పి.సంపత్‌రావు సూచించారు. సోమవారం స్థానిక శారదానగర్ శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపన్ టెస్టింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈనెల 5 నుంచి పదో తేదీ వరకు శిబిరం నిర్వహిస్తారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఆయన తెలిపారు. జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ ఎస్.జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు టి.ప్రమోదిని, జె.రవీందర్, ఎస్.భరతమాత, వెంకటలక్ష్మి, పి.సాయినిరంజన్, ఎ.సుందరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు. కాగా, సీఎం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. విద్యార్థి జేఏసీ జిల్లా కో కన్వీనర్ సూర శ్యామ్, నాయకులు తిప్పారపు దయాకర్, తిరుపతి, ఖలీమ్, పారుపల్లి గుణపతి, ముత్యం రమేశ్, బాపూరావు పాల్గొన్నారు.

జిల్లాలో 305 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

మంథని: జిల్లాలో 305 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే 57 ప్రారంభించామని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. మంథని, ఎక్లాస్‌పూర్ మార్కెట్‌యార్డ్‌లో సోమవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి కనీస మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలకు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 ధర చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సహకార అధికారి శ్రీమాల, పీఏసీఎస్ సీఈవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

90 ప్రాజెక్టులు.. 73వేల మెగావాట్లు

- దేశానికి వెలుగులు విరజిమ్ముతున్న ఎన్టీపీసీ
- నేటితో 48 వసంతాలు పూర్తి
- ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

జ్యోతినగర్(రామగుండం): 90 విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు.. 2032 సంవత్సరం నాటికి 1,28,000 మెగావాట్ల నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యంతో దేశానికి వెలుగులు అందిస్తున్న నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ(ఎన్టీపీసీ) మంగళవారంతో 48 వసంతాలు పూర్తిచేసుకుంటోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 73,874 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. కొత్త ప్రాజెక్టులకు అంకురార్పణ చేస్తూ ప్రగతి పథంలో ముందుకు సాగుతోంది. సంస్థలో ప్రస్తుతం 17,794 మంది ఉద్యోగులు(ఎగ్జిక్యూటివ్స్) విధులు నిర్వర్తిస్తున్నారు.

1975న ఎన్టీపీసీగా నామకరణం..

విద్యుత్ కొరతను అధిగమించేందుకు కేంద్రప్రభుత్వం అధీనంలో విద్యుత్ ప్రాజెక్టు, పంపిణీ ఉండాలనే లక్ష్యంతో అప్పటి సర్కార్ ఢిల్లీ ఎలక్ట్రిసిటీ బోర్డుకు చెందిన బదర్‌పూర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని టేకోవర్ చేసింది. 1975 నవంబర్ 7న ఎన్టీపీసీ రిజిష్టర్ ఆఫ్ కంపెనీస్‌గా నమోదు చేసి జాతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)గా నామకరణం చేసింది.

ప్రగతి పథంలో..



రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టు

దేశంలో బొగ్గు గనులు, గ్యాస్, నీరు, స్థలం తదితర వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ, కొత్త ప్రాజెక్టులు స్థాపిస్తూ ముందుకు సాగుతోంది ఎన్టీపీసీ. ప్రస్తుతం దేశంలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ఎదిగింది. ప్రపంచ స్థాయి విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో పోటీ పడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పవర్ ప్లాంట్ సామర్థ్యం, పీఎల్ఎఫ్, మెయింటనెన్స్, విధానాలు, రక్షణ, పొదుపు, పర్యావరణ సమతుల్యం, మేనేజ్‌మెంట్ విధానాలతో అగ్రస్థానంలో నిలిచింది. విద్యుత్ ఉత్పత్తిలో అగ్రభాగాన నిలుస్తూ నవరత్న కంపెనీగా ఉన్న ఎన్టీపీసీ 2010లో మహారత్న కంపెనీగా రూపాంతరం చెందింది.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల స్థాపన..

ఎన్టీపీసీ సొంతంగా బొగ్గు, గ్యాస్, హైడ్రో, సోలార్, ఫ్లోటింగ్ సోలార్, జాయింట్ వెంచర్స్‌తోపాటు 90 విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కలిగి ఉంది. 73,874 మెగావాట్లు ఉత్పత్తి చేస్తూ విద్యుత్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రస్తుతం సూపర్ క్రిటికల్ మెగా ప్రాజెక్టులు నెలకొల్పుతోంది. ఎన్టీపీసీ తన ప్రధాన వ్యాపారాన్ని బలోపేతం చేయడానికి, కన్సల్టెన్సీ, పవర్ ట్రేడింగ్, విద్యుత్ నిపుణుల శిక్షణ, బొగ్గు తవ్వకాల్లో వైవిధ్య భరితంగా ముందుకుసాగుతోంది. ప్రపంచంలోనే ప్రముఖ విద్యుత్ సంస్థగా అవతరించాలని ప్రయాణం సాగిస్తోంది.

వివిధ రంగాల్లో ఎన్టీపీసీ..

ఒకప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేసిన ఎన్టీపీసీ.. భవిష్యత్‌లో ఉత్పత్తి, పంపిణీ, కొనుగోలు, అమ్మకాలు, సొంతంగా బొగ్గు గనుల తవ్వకం తదితర రంగాల్లో ఇతర సంస్థలతో కలిసి వ్యాపారాలు చేస్తోంది. జాయింట్ వెంచర్లతో బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక దేశాల్లో విద్యుత్ ప్రాజెక్టులు స్థాపిస్తోంది. అణు విద్యుత్ రంగంలోకి అడుగుపెట్టే తొలిఅవకాశం ఎన్టీపీసీకే దక్కుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి



కొత్తపల్లి(కరీంనగర్): పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించబోయే జాతీయ స్థాయి సెస్టోబాల్ టోర్నమెంట్‌కు కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ– టెక్నో స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎ.స్నేహిత్‌చంద్రారెడ్డి ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు పాఠశాలలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థికి అర్హతపత్రం అందించి అభినందించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర సెస్టోబాల్ పోటీల్లో స్నేహిత్‌చంద్రారెడ్డి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు.

బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

తిమ్మాపూర్(మానకొండూర్): స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ కరీంనగర్ తిమ్మాపూర్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజులపాటు శిక్షణనిస్తామని, వసతి, భోజనంతోపాటు 2 డ్రెస్‌లు, టూల్ కిట్స్ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తామన్నారు. 10వ తరగతి చదివి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసువారు అర్హులని తెలిపారు. దరఖాస్తుకు పదోతరగతి మెమో, ఆధార్‌కార్డ్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లు, 5 ఫొటోలు చేయాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 99494 48157 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రాజ్‌ఠాకూర్ వాహనం తనిఖీ



గోదావరిఖని: రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ వాహనాన్ని పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. ఫైవింక్లయిన్‌సమీపంలో వన్‌టౌన్ పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపి అందులోని సోదాలు చేశారు. వాహనంలో తనిఖీలు చేస్తున్నంత సేపు రాజ్‌ఠాకూర్ దూరంగా నిల్చొని పోలీసులకు సహకరించారు.

ఐదుగురి అరెస్ట్

మెట్‌పల్లి: పట్టణంలోని బస్ డిపో చౌరస్తాలో ముగ్గురిపై దాడికి పాల్పడ్డ ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి సోమవారం తెలిపారు. సాయిరాంకాలనీకి చెందిన కృష్ణ, సాగర్, సిద్ధు ఆదివారం రాత్రి డిపో చౌరస్తాలో ఉండగా.. అక్కడికొచ్చిన ఇందిరానగర్‌కు చెందిన సాయి, రాములు, రాఘవ, భరత్, అజయ్ పాత గొడవలను దృష్టిలో ఉంచుకొని బండ రాళ్లతో దాడి చేశారు. ముగ్గురికి గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు.. ప్రతిభకు మెట్టు

- ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్ బీ
- నాలుగు కేటగిరీల్లో పరీక్ష నిర్వహణ
- హాజరైన విద్యార్థులు



స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుతం విద్యార్థులు మొదలుకొని పెద్దల వరకు ఆంగ్ల భాషలోనే మాట్లాడేందుకు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. ఇక ఆంగ్ల మాధ్యమ పాఠశాలల సంగతి చెప్పనక్కర లేదు. ఈ రోజుల్లో విద్యార్థులకు ఆంగ్ల భాషలోని పదాలు, వాటిని పలికే విధానం, కొత్త పదాలు ఎలా ఉంటేయో తెలిపేందుకు సాక్షి, ఇండియా స్పెల్ బీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేస్తున్న ప్రయోగం స్పెల్ బీ పరీక్ష. విద్యార్థులకు ఆంగ్లంపై ఆసక్తిని పెంచేందుకు, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి, అక్షర దోషం లేకుండా రాయడానికి స్పెల్ బీ పరీక్ష దోహదపడుతుంది. ఈనేపథ్యంలో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని రావూస్ పాఠశాలలో నిర్వహించిన స్పెల్ బీ మొదటి రౌండ్ పరీక్షకు స్పందన వచ్చింది. విద్యార్థులకు కేటగిరీల వారీగా పరీక్ష నిర్వహించారు. కేటగిరీ 1లో 1,2వ తరగతి విద్యార్థులు, 2వ కేటగిరీలో 3, 4, కేటగిరీ 3లో 5,6,7 తరగతులు, 4వ కేటగిరీలో 8,9,10 విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రావూస్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ రహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీస్తున్న స్పెల్ బీ



ఇంగ్లిష్‌ను కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకుంటారు. ఇంగ్లిష్ నేర్చుకోవాలన్న ఆలోచనను 'సాక్షి' తీసుకొచ్చింది. స్పెల్ బీతో విద్యార్థుల మధ్య ఆరోగ్యవంతమైన పోటీ ఏర్పడుతుంది. ఇలాంటి పరీక్షలను నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం 'సాక్షి' కల్పించడం అభినందనీయం.

– ఎండీ రహమాన్, రావూస్ స్కూల్ ప్రిన్సిపాల్

కొత్త పదాలు తెలిశాయి



నేను స్పెల్‌బీ పరీక్ష రాశా. న్యూ వర్డ్స్ నేర్చుకున్నా. చాలా కొత్త పదాలు ఉన్నాయి. బుక్స్‌లో లేని పదాలు కూడా ఉన్నాయి. అవి ఏంటో తెలుసుకున్నా. జోనల్ రౌండ్‌కు కూడా సెలెక్ట్ అవుతా. ఇంకా కొత్త పదాలు నేర్చుకుంటా.

– మిషా జైన్, 1వ తరగతి

ఇంగ్లిష్‌పై పట్టు సాధించా



స్పెల్ బీతో ఇంగ్లిష్‌పై పట్టు సాధించా. స్పెల్లింగ్స్ కూడా చాలా వరకు నేర్చుకున్న. మొదటి రౌండ్ బాగా రాశా. జోనల్, ఫైనల్ రౌండ్‌కు కూడా అర్హత సాధిస్తా. ఇంగ్లిష్ పదాలు మరిన్ని నేర్చుకోవాలనిపిస్తుంది. స్పెల్ బీ పరీక్ష బాగుంది. కొత్తకొత్త పదాలు తెలిశాయి.

– హృతిక్ సాయివర్మ, 5వ తరగతి

నాలెడ్జ్ ఇంప్రూవ్ అవుతుంది



స్పెల్ బీ పరీక్షతో మాలో నాలెడ్జ్ ఇంప్రూవ్ అయ్యింది. ఏటా ఇలాంటి పరీక్షలను ప్రతీ స్కూల్‌లో నిర్వహించాలి. 'సాక్షి' స్పెల్‌బీ విద్యార్థులకు చాలా ఉపయోగపడే పరీక్ష. బుక్స్‌లో చాలా హార్డ్ వర్డ్స్ ఉన్నాయి. అన్ని స్పెల్లింగ్స్ తెలుసుకున్నాం.

– భువనేశ్వరి, అమితారెడ్డి, 9వ తరగతి

ఫైనల్ రౌండ్‌కు వెళ్తా..



స్పెల్ బీ పరీక్ష ఫస్ట్ రౌండ్ చాలా బాగా రాశా. సెకండ్, థర్డ్ రౌండ్‌లతో పాటు ఫైనల్ రౌండ్ వరకు వెళ్లడమే నా టార్గెట్. బుక్ బాగా ప్రిపేర్ అయ్యా. పరీక్ష కూడా హార్డ్‌గా ఉంది. అన్నింటికీ కరెక్ట్‌గా స్పెల్లింగ్స్ రాశాను.

– జి.మనోగ్న, 8వ తరగతి

అప్పుడు నిండుకుండలా.. ఇప్పుడు వెలవెల..



రామగుండం వద్ద గోదావరినదిలో ఇసుక తెన్నెలు



మంథని వద్ద వెలవెలబోతున్న గోదావరి



మంథనిలో బయటపడ్డ విగ్రహాల శిథిలాలు

మంథని/రామగుండం: జిల్లాలోని మంథని, రామగుండం వద్ద గోదావరి నది నాలుగేళ్లనాటి వైభవం సంతరించుకుంది. కాళేశ్వరం జలాలలో మొన్నటివరకు నిండుకుండలా ఉన్న గోదావరి.. ఇరువైపులా నీటి అలలతో సముద్రాన్ని తలపించింది. రెండు రోజుల నుంచి జలకళలేక వెలవెలబోతోంది. ఇసుక దిబ్బలు, బండ రాళ్లు తేలాయి. మంచిర్యాల జిల్లా శివ్వారం వైపు నాటు పడవల్లో దాటుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం బ్యారేజీలో ఐదు గేట్లు ఎత్తి 11,472 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇక్కడ 10.85 టీఎంసీల నీటి సామర్థ్యానికి కేవలం 1.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. పార్వతీ బ్యారేజీలో ఐదు గేట్లు ఎత్తి 2,300 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీలో 2.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పార్వతీ బ్యారేజీ నుంచి పది రోజులుగా చేరుతున్న నీరు క్రమేపి అన్నారంలోకి, ఆ తర్వాత దిగువకు వెళ్లిపోతుండడంతో నీటిమట్టం పూర్తిగా తగ్గింది. గోదావరి నదిలోని శివలింగాలు, శ్రాద్ధమండపం, స్నానఘట్టాలు తేలాయి. ఇటీవల నిమజ్జనం చేసిన గణేశ్, దుర్గామాత విగ్రహాల శిథిలాలు కనిపిస్తున్నాయి. అనేక వ్యర్థాలు బయటపడ్డాయి. గోదావరిలో నాటి పరిస్థితితులు కనిపించడంతో భక్తులు వచ్చి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ–1 పోస్టు, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ 1 పోస్టుకు గెస్ట్ లెక్చరర్‌ల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఖాజా జహీర్‌అహ్మద్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని వివరించారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ బోధన అనుభవం గల వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 8వ తేదీన సాయంత్రం 4గంటల లోపు ఆయా కళాశాలలోని ప్రిన్సిపాల్స్‌కు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెద్దపల్లిలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక



విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో సౌత్‌జోన్ కబడ్డీ ఎంపిక పోటీలు ప్రారంభమైనాయి. సోమవారం పోటీలను యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ మల్లేశ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ కాలేజీల నుంచి సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 12 వరకు కాకినాడలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులకు యూనివర్సిటీ తరుపున టీషర్ట్, షూ అందించి, టీఏ, డీఏ చెల్లించడం జరుగుతుందని వివరించారు. విశ్వవిద్యాలయంలో 2022–23 సంవత్సరానికి గాను ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ సమర్థవంతంగా నిర్వహించిన పీడీలు ప్రభాకర్‌రావు, శ్రీధర్‌రావు, నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ అధి కారి నజీమొద్దీన్, వివిధ కళాశాల పీడీలు పాల్గొన్నారు.

లింగంపేటలో వ్యక్తి దారుణ హత్య



గంగనర్సయ్య మృతదేహం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ శివారులోని లింగంపేటలో ఆదివారం రాత్రి పిట్టల గంగనర్సయ్య(33) అనే వ్యక్తిని బోదాసు రాజు అనే వ్యక్తి కర్రతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన పిట్టల గంగనర్సయ్య, బోదాసు రాజు ట్రాక్టర్ డ్రైవర్లు. ఇద్దరు స్నేహితులు కూడా కావడంతో ఆదివారం రాత్రి బోదాసు రాజు పిట్టల గంగనర్సయ్యను తన ద్విచక్ర వాహనంపై లింగంపేటలో వారి బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభ కార్యానికి తీసుకెళ్లాడు. రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి వెళ్దామనే విషయంలో గంగనర్సయ్య, రాజు మధ్య గొడవ జరిగింది. గంగనర్సయ్య రాజును నెట్టేయడంతో క్షణికావేశంలో అక్కడే ఉన్న కర్రతో గంగనర్సయ్య తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం బోదాసు రాజు అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, సీఐ నటేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలున్నారు. మృతుడి భార్య జల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సమస్యల వలయంలో కుందనపల్లి



శిథిలావస్థకు చేరిన యాష్‌పాండ్ ప్రధాన రహదారి

- శిథిలావస్థకు చేరిన రోడ్డుతో ప్రజల ఇక్కట్లు
- ఐటీసీ నుంచి యాష్‌పాండ్ వరకు అధ్వానంగా మారిన దారి
- నిర్వాసితులపై ఎన్టీపీసీ నిర్లక్ష్య వైఖరి

రామగుండం: త్యాగధనుల పునాదులపై నిర్మితమైన నవరత్న కంపెనీ ఎన్టీపీసీ దేశ వ్యాప్తంగా వెలుగులు విరజిమ్ముతున్నప్పటికీ దీపం కింద చీకటి అనే చందంగా తయారైంది కుందనపల్లి నిర్వాసిత గ్రామ దుస్థితి. దేశానికి వెలుగులు అందిస్తూ కోట్లాది రూపాయలు గడిస్తున్నా ఎన్టీపీసీ సామాజిక బాధ్యత పథకం నిధులతో నిర్వాసిత గ్రామాలపై ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుంది. ఐటీసీ నుంచి అక్బర్‌నగర్ యాష్‌పాండ్ వరకు గల ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరి గుంతలమయమైంది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు కుదుపులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వర్షాకాలమైతే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది. దీంతో పాటు ఏటా మే సీజన్‌లో బూడిద చెరువు నుంచి ఈదురుగాలులతో మూడు గ్రామాలను బూడిద కప్పేస్తుంది. గ్రామానికి అతి సమీపంలో బూడిద చెరువు ఉండడంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై గ్రామస్తులు అనారోగ్యాల పాలవుతున్నారు.

సమస్యలు ఇలా..

- ఐటీసీ నుంచి యాష్‌పాండ్ వరకు నాణ్యతతో కూడిన రహదారి నిర్మించాలి.
- అక్బర్‌నగర్‌లో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చి తాగునీటిని సరఫరా చేయాలి.
- మొగల్‌పహాడ్, ఇందిరమ్మకాలనీ, అక్బర్‌నగర్, కుందనపల్లి గ్రామాల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టి అంతర్గత రహదారులు నిర్మించాలి.
- ఏటా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఈదురుగాలులకు బూడిద లేవకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలి.
- అత్యవసర పరిస్థితుల్లో నిర్వాసిత ప్రజలు ఆస్పత్రికి వెళ్లేందుకు అంబులెన్స్ సదుపాయం కల్పించాలి.
- ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు పొందేందుకు నిర్వాసిత గ్రామ ప్రజలకు ఎన్టీపీసీ ప్రత్యేకంగా హెల్త్‌కార్డులు జారీ చేయాలి.

అధికారులకు విన్నవించాం



నిర్వాసిత గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని ఇప్పటికే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎస్ఆర్ అధికారులు సమర్పించాం. మూడు మాసాల్లో కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఆ దిశగా ఇప్పటికీ చర్యలు ప్రారంభించలేదు. మరో రెండు నెలల్లో కుందనపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధి పనులు చేపట్టేలా ఒత్తిడి పెంచుతాం.

– కొండల రాజేందర్‌కుమార్, అక్బర్‌నగర్

రహదారి అధ్వానం



ఐటీసీ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే ప్రధాన రహదారి మార్గం అధ్వానంగా తయారైంది. ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమంలో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే రోడ్డుపై యాష్‌పాండ్ పర్యవేక్షణకు నిత్యం ఎన్టీపీసీ అధికారులు వాహనాల్లో తిరుగుతున్నా కనీసం రహదారి నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరం.

– సిద్ధ నరేశ్, మొగల్‌పహాడ్

ఆన్‌లైన్ లోన్ పేరిట మోసం

- ఉద్యోగాల పేరిట రూ.20 లక్షలు టోకరా



పట్టుబడిన నగదు, సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు, చెక్ బుక్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: గంభీరావుపేటకు చెందిన మహిళకు బ్యాంకు రుణం ఇప్పిస్తామని మోసం చేసిన సైబర్ నేరగాళ్లను సిరిసిల్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియాతో మాట్లాడారు. జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు ఆన్‌లైన్ ఆప్ లోన్‌లో ఉన్న ఫోన్ నెంబర్లు సాధించి తద్వారా పలువురికి ప్రభుత్వ బ్యాంకుల నుంచి లోన్ ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షలు కొట్టేసినట్లు వివరించారు. నల్గొండ జిల్లా దామడిచెర్ల మండలం కొండూరు జానారెడ్డికాలనీకి చెందిన ధనవాత్ రమేశ్, ధనవాత్ రాజు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. డబ్బు సరిపోక హయాత్‌నగర్‌లోని ఓ ఇల్లు అద్దెకు తీసుకుని డ్రైవర్‌గా పని చేశారు. జస్ట్ డయల్ యాప్‌లో పని కుదుర్చుకున్నారు. పలువురికి లోన్ల పేరిట కాల్ చేసి రుణమిప్పిస్తానని నమ్మబలికారు. సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలానికి చెందిన పద్మావతికి ఏకంగా రూ.26 లక్షలు రుణమిప్పిస్తామని చెప్పి ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్ ఫీజు కింద రూ.3,58,795 మిర్యాలగూడలోని ఓ బ్యాంకు యూపీఐతో ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. అయితే ఆన్‌లైన్ రుణాలిప్పిస్తామన్న కేసుల నమోదున్న రమేశ్, రాజు ఇదే సమయంలో రిమాండ్ వెళ్లారు. తిరిగి జైలు నుంచి రాగానే మళ్లీ పద్మావతికి ఫోన్ చేసి లోన్ రావాలంటే ఇంకో రూ.22వేలు పంపించాలనడంతో అనుమానం వచ్చిన పద్మావతి గంభీరావుపేట పోలీసులకు చెప్పింది. డబ్బులిస్తానని చెప్పడంతో రమేశ్, రాజు గంభీరావుపేట లింగన్నపేట క్రాస్ రోడ్డు వద్దకు రాగానే సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ మహేశ్, సైబర్ క్రైం ఆర్ఎస్ఐ జునైద్ చాకచక్యంగా పట్టుకున్నారు. వీరి నుంచి కారు, చెక్ పుస్తకాలు, 3 ఏటీఎం కార్డులు, మూడు మొబైళ్లు, రూ.6.50 లక్షల నగదు పట్టుకున్నారు. ఇప్పటికే వారిపై సైబరాబాద్, అల్వాల్, బేగంపేట, గోపాలపురం, మహంకాళి, రాజేంద్రనగర్, కామారెడ్డి, ఖమ్మం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవ్వగా.. బాధితులుగా 19 మంది ఉన్నారు. ఉద్యోగాల పేరిట దాదాపు రూ.20 లక్షలు మోసం చేసినట్లు ఫిర్యాదులున్నాయని పోలీసులు వెల్లడించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ మహేశ్, సైబర్ క్రైం ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ జనాభా లెక్కలు తేల్చాలి

- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓబీసీ జనాభా లెక్కలు తేల్చడంలేదని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. తొమ్మిదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమి లేదని, బీజేపీని జనం నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాటా ఇచ్చి మాదిగలను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రధాని మోదీ హైదరాబాద్‌లో మాదిగ ఉపకులాలు నిర్వహించే విశ్వరూప మహాసభకు హాజరవుతారని, సభకు వచ్చే ముందు వారికి ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. రైతులపై నల్లచట్టాలు తెచ్చిన బీజేపీ వారిపై విద్వేషాన్ని చూపించిందని మండిపడ్డారు. స్థానిక ఎంపీ బండి సంజయ్, మంత్రి గంగుల కమలాకర్ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ బహుజనుల పట్ల కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రజా, కుల సంఘాలను చులకనగా చేస్తే రానున్న రోజుల్లో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజా సంఘాల పాత్ర, ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. తరతరాలుగా అణచివేతకు గురవుతున్న బలహీన వర్గాలను రాజ్యాధికారం దిశగా పయనింపజేయడమే ప్రజా సంఘాల జేఏసీ లక్ష్యమని అన్నారు.

పుస్తెల తాడు చోరీ

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన గరిమెళ్ల సౌజన్య సోమవారం ఉదయం ఇంట్లో పూజ చేస్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బాధితురాలి కంట్లో మట్టి కొట్టి మెడలోంచి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని పారిపోయినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. దాని విలువ సుమారు రూ.1.50 లక్షలుంటుందని బాధితురాలు చెప్పారు. పోలీసులు, క్లూస్‌టీం వివరాలు సేకరించారు. బాధితురాలి భర్త స్థానికంగా పూజాస్టోర్ నిర్వహిస్తారు. ఆయన బయటికెళ్లడంతో చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా


నజ్ముల్ షకీబ్


అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్ముదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్ముదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్ముదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!


● రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50


● అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్


● కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

\- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


● ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

\- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

\- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

\- దర్శకుడు మారేష్ శివన్

''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.

